APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక

neelagirivartha@gmail.com

ఏపీ & తెలంగాణ | ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి | శనివారం | 28-12-2024 | సంపుటి : 15 | సంచిక : 168 | పేజీలు : 12 | వెల : 5/- | అసోసియేట్ ఎడిటర్ : చెన్నూరి అన్వేషి



## మర్చిపోవడం చంద్రబాబు నైజం

2లో




## మన్మోహన్‌తో విడదీయరాని బంధం

2లో







# మన్మోహన్‌కు ప్రముఖుల నివాళి

- ఇంటికి వెళ్లి నివాళి అర్పించిన రాష్ట్రపతి ముర్ము
- ప్రధాని మోదీ, అమిత్ షా తదితరుల శ్రద్ధాంజలి
- కేబినేట్ భేటీలో ఘనంగా నివాళి
- వారంపాటు దేశంలో సంతాపదినాలు
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- ప్రధాన కార్యాలయాలపై జాతీయజెండా అవనతం

**న్యూఢిల్లీ - నీలగిరివార్త :**
భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తదితర ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మన్మోహన్ సింగ్ మృతిపై రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూయడంతో దేశ ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన పార్థివదేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరంద్రమోదీ నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం మన్మోహన్ నివాసానికి వెళ్లిన వీరు.. ఆయన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆర్థికవేత్తగా, సంస్కరణల సారథిగా మన్మోహన్ సింగ్‌ను దేశం గుర్తుంచుకుంటుంది. ఆర్‌బీఐ గవర్నర్ సహా అనేక కీలక పదవుల్లో దేశానికి సేవలందించారు. పీవీ హయాంలో ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేశారు. దేశం, ప్రజల పట్ల ఆయన సేవాభావం స్మరించుకోదగినది. విలక్షణ పార్లమెంటేరియన్‌గా ఆయన సేవలు అందించారు. ఎన్నో కీలక పదవులు చేపట్టినా నిరాడంబర జీవితం గడిపారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఆయనతో చాలాసార్లు మాట్లాడా. ఆయన మృతి విచారకరం. నా తరఫున, దేశ ప్రజల తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నా' అని మోదీ తెలిపారు. అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం ప్రకటించింది. మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినేట్ అత్యవసరంగా సమావేశమై ఘనంగా నివాళి అర్పించింది. వారంపాటు సంతాపదినాలు ప్రకటించింది. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా కేంద్ర ప్రభుత్వం 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. రాష్ట్రపతి భవన్ సహా అన్ని ప్రభుత్వ భవనాలపై జాతీయ పతాకాన్ని సగానికి అవనతం చేశారు. అటు ఏఐసీసీ ప్రధాన కార్యాలయంపైనా జాతీయజెండాను సగానికి దించారు. కాంగ్రెస్ పార్టీ కూడా వచ్చే ఏడు రోజుల పాటు కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుంది. 92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గత రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా సేవలందించారు. అంతకుముందు ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు

మిగతా 2వ పేజీలో...



## నిజమైన రాజనీతిజ్ఞుడు

- దేశం కోసమే తన జీవితాన్ని దారపోశారు
- మన్మోహన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తాం
- సీడబ్ల్యూసీ ప్రత్యేక సమావేశంలో తీర్మానం
- మన్మోహన్‌కు సోనియా, రాహుల్ నివాళి
- ఖర్గే తదితరులు శ్రద్ధాంజలి
- నేడు ఎఐసిసి కార్యాలయానికి పార్థివదేహం

**న్యూఢిల్లీ - నీలగిరివార్త :**
మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సంతాప తీర్మానం చేసింది. మన్మోహన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తామని

మిగతా 2వ పేజీలో...

# మన్మోహన్ కేబినేట్‌లో పనిచేయడం అదృష్టం

- తెలంగాణతో ఆయనది ప్రత్యేక అనుబంధం
- రాష్ట్ర ఏర్పాటుకు సహకరించారని కెసిఆర్ ప్రకటన
- మన్మోహన్ అంత్యక్రియల్లో బీఆర్ఎస్ నేతలు
- ఘనంగా నివాళి అర్పించనున్న కేటీఆఆర్ బృందం
- కేసీఆర్ ఆదేశాలతో హస్తినకు పయనం

**బ్యూరోచీఫ్- నీలగిరివార్త :**
మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు భారత రాష్ట్ర సమితి నేతలు హాజరు కానున్నారు. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, పార్టీ ఎంపీలు, ప్రతినిధులు నివాళులర్పించనున్నారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు హాజరు కావాలని కేటీఆర్, ఎంపీలను ఆ పార్టీ అధినేత ఆదేశించారు. ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్టుగా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారన్నారు. ఆయనతో తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు మన్మోహన్ అందించిన సహకారం తెలంగాణ సమాజం ఎప్పటికీ మర్చిపోదు. తెలంగాణ కోసం పోరాడిన సమ-యంలో ప్రతి సందర్భంలో

మిగతా 2వ పేజీలో...





## మన్మోహన్‌సింగ్ హయాంలోనే తెలంగాణ!

రాష్ట్ర సాధనలో మన్మోహన్ సానుకూల అడుగులు

**హైదరాబాద్- నీలగిరివార్త :**
మంచి మనసున్న నాయకుడుగా పేరున్న మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కూడా అదే విధానాన్ని పాటించారు. ఎప్పటి నుంచో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తెలంగాణలో జరుగుతున్న బలిదానాలు, ఉద్యమాలను చూసిన ఆయన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సానుకూలంగా వ్యవహరించారు. జరిగిన ఆరవై ఏండ్ల సుదీర్ఘ పోరాటానికి మన్మోహనుడి ప్రభుత్వంలోనే ముగింపు

మిగతా 2వ పేజీలో...

# ఎన్నికలు ఎలాపెడతారో చూస్తా!

- సీఎం రేవంత్‌కు ఎమ్మెల్సీ కవిత సవాల్
- రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలా?
- తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరిక
- జనవరి 3న ఇందిరా పార్కు వద్ద సభ
- కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌పై నిలదీత

**బ్యూరోచీఫ్ - నీలగిరివార్త :**
బీసీలకు రిజర్వేషన్లు పెంచకుంటే స్థానిక ఎన్నికలు జరగనివ్వమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రేవంత్ సర్కార్‌ను హెచ్చరించారు. జనవరి 3 న ఇందిరా పార్కు దగ్గర సభ నిర్వహిస్తామని కవిత అన్నారు. ఈ రోజు బీసీ సంఘాలతో ఆమె సమావేశం అయ్యారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో పేర్కొందన్నారు. బీసీల జనాభా ఎంతో తెలియంది హామీ ఎలా ఇచ్చారు? అని ప్రశ్నించారు. జనాభాలో సగానికిపైగా బీసీలు ఉన్నారన్నారు. కానీ 42 శాతం అని కాంగ్రెస్ ఎలా చెబుతుందో? అంతుపట్టడం లేదన్నారు. ఆ 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండానే ఎన్నికలు నిర్వహిస్తారా? అన్న అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు.



తీవ్ర పరిణామాలు...

42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. మండల

మిగతా 2వ పేజీలో...

# నిద్ర లేచింది మహిళా లోకం!

- సీఎం రేవంత్‌రెడ్డిపై నటి మాధవీలత సంచలన వ్యాఖ్యలు
- దిల్ రాజుని అడ్డం పెట్టుకుని వరస్ట్ పనులేంటి అని ప్రశ్న
- అల్లు అర్జున్ చేసింది క్రైమ్ కాదని పేర్కొన్న మాధవీలత
- స్పందించక పోవడం చేసిన పొరపాటు అని దిద్దుబాటు
- తప్పుకు, నేరానికి, పొరపాటుకు చాలా తేడా ఉందని వ్యాఖ్య
- నిన్న మెదక్ జిల్లాలో ఒక చిన్నపాపపై అత్యాచారం చేశారట
- దానిపై అసెంబ్లీలో మాట్లాడతారా? ఓవైసీ, అక్బరుద్దీన్‌కు సవాల్
- కొడంగల్‌లో రైతు ఆత్మహత్య, విద్యార్థుల మృతిపై నిలదీత
- సోషల్ మీడియా వేదికగా నటి మాధవీలత సర్కారుపై ఫైర్



**బ్యూరోచీఫ్ - నీలగిరివార్త :**
సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్ చేసింది క్రైమ్ కాదు. ఆ విషయంపై ఆయన స్పందించకపోవడమే పొరపాటు. తప్పుకు, నేరానికి, పొ-రపాటుకు చాలా తేడా ఉంది అంటూ నటి మాధవీ లత సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను విడుదల చేశా-రు. ఈ వీడియోలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఆమె కొన్ని ప్రశ్నలు సంధించింది. ఈ వీడియోలో ఆమె మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సార్ ను కొన్ని సూటి ప్రశ్నలు అడుగుదామని అనుకుంటున్నా! ఇప్పటికే చాలా మంది అడిగేశారు. కాస్త లేటయి పోయింది. నేను కొంచెం బిజీగా ఉండటంవల్ల అడగలేక పోయానన్న మాట. అన్నట్లు, నిన్న మెదక్ జిల్లా లో ఒక చిన్నపాపపై అత్యాచారం చేశారట. దాని గురించి అసెంబ్లీలో మాట్లాడతారా? ఓవైసీ, అక్బరుద్దీన్ ప్రశ్నిస్తారా? పసిపిల్ల, ఆడబిడ్డ, ప్రాణం, పాపం, అయ్యో, అబ్బాస్ తప్పు చేశాడు. శిక్ష విధించండి. దీనిపై

మిగతా 2వ పేజీలో...



## 30వ తేదీకి అల్లు అర్జున్ కేసు వాయిదా

- రెగ్యులర్ బెయిల్‌పై నాంపల్లి కోర్టులో విచారణ
- కౌంటర్ దాఖలుకు సమయం కోరిన పీపీ
- తొక్కిసలాట కేసు విచారణ జనవరి 10న

**బ్యూరోచీఫ్ - నీలగిరివార్త :**
సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నటుడు అల్లు అర్జున్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసింది నాంపల్లి కోర్టు. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని చిక్కడపల్లి పోలీసులను కోర్టు ఆదేశించింది. ఇది ఇలా ఉంటే ఈ నెల 4వ తేదీన పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ దగ్గర తొక్కిసలాట కేసులో హీరో అల్లు అర్జున్ ను ఏ11 ముద్దాయిగా చేర్చారు చిక్కడపల్లి పోలీసులు. ఈ కేసులో డిసెంబర్ 13న హీరో అల్లు అర్జున్ ను పోలీసులు అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా

మిగతా 2వ పేజీలో...

# పెద్దపల్లిలో ప్రొటోకాల్ రగడ!

- శిలాఫలకాల్లో అధికారులు పేరు పెట్టట్లేదని ఎంపీ వంశీ సంచలన ఆరోపణ
- ఎవరు ఎందుకు చేయిస్తున్నారో కనుక్కోవాలి
- వంశీకృష్ణ వ్యాఖ్యలతో ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం
- వివేక్‌కు మంత్రి పదవివ్వడం ఎమ్మెల్యేలకు ఏ మాత్రం ఇష్టంలేదనే చర్చ
- గడ్డం సోదరులకు మంత్రి పదవియిస్తే ఇబ్బందిలేదంటున్న ఎమ్మెల్యేలు
- ఆధిపత్య పోరు పెద్దపల్లి పార్లమెంట్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా చర్చ
- ఏం జరగనున్నదోననే అంశం రసవత్తరంగా మారిందన్న అభిప్రాయం

**చెన్నూరి అన్వేషి, బ్యూరో ఛీఫ్ - నీలగిరివార్త :**
పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ విషయంలో ప్రొటోకాల్ రగడ మొదలయ్యింది. అధికారిక కార్యక్రమాలకు తనను ఆహ్వానించడం లేదని, శిలాఫలకాల్లో అధికారులు తన పేరు పెట్టడం లేదని, ఇలా ఎవరు చేయిస్తున్నారో? ఎందుకు చేయిస్తున్నారో? కనుక్కోవాలి అంటూ ఎంపీ వంశీకృష్ణ వ్యాఖ్యానించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతున్నది. ఈ వ్యాఖ్యలు అటు కాంగ్రెస్ పార్టీలో, ఇటుజిల్లా ప్రజల్లోచర్చనీయాంశంగా మారాయి. ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం



నుంచి గడ్డం వంశీకృష్ణ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌పై పోటీ చేసి గెలుపొందారు. అంతకు ముందు జరిగిన ఎన్నికల్లో పార్లమెంట్‌లోని 7 అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసింది. ఇందులో ఎంపీ వంశీ కృష్ణ తండ్రి వివేక్ వెంకటస్వామి చెన్నూరు నుంచి, పెద్దనాన్న గడ్డం వినోద్ కుమార్ బెల్లంపల్లి నుంచి విజయం సాధించారు. మంథని నుంచి గెలుపొందిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఎంపీ వంశీకృష్ణ మంత్రి, ఎమ్మెల్యేల కంటే వయసులో చిన్నవాడు. పార్టీ నిర్వహించే కార్యక్రమాలతో పాటు, పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో కాకపోయినా కొన్ని కార్యక్రమాలకు హాజ-రవుతున్నారు. ఎంపీ హాజరవుతున్న కొన్ని కార్యక్రమాలకు సైతం అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఆయన ఆరోపణ తనకు ప్రొటోకాల్ పాటించకుండా ఎవరైనా నిలువరిస్తున్నారా? అనే అనుమానాలుఎంపీ వ్యక్తం చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మంచిర్యాలలో జిల్లాలో గడ్డం వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మిగిలిన ఎమ్మెల్యేలకు ఏ మాత్రం ఇష్టం లేదనే గుసగుసలు ఇపుడు వినిపిస్తున్నాయి. మంచిర్యాల జిల్లా నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు దవాఖాన ప్రారంభోత్సవం సందర్భంగా ఎంపీ గడ్డంవంశీకృష్ణను పిలవలేదని, ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీ అనుచరులే తీవ్రంగా మండిపడ్డారు. పెద్దపల్లిలో జరిగిన సీఎం హాజరైన యువవికాసం బహిరంగ సభలో కూడా తన విషయంలో ప్రొటోకాల్ పాటించడంలేదని వ్యాఖ్యానించారు. తాజాగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధి లో ప్రెస్‌మీట్‌లు పెట్టి మరోసారి ప్రొటోకాల్ అంశంతో పాటు ప్రభుత్వ జీవోఉన్నాకూడా కాకా వెంకటస్వామి వర్ధంతిని అధికారికంగా కొని చోట్ల నిర్వహించలేదని ఆరోపించారు. ఎంపీ వంశీ విషయంలో అధికార పార్టీఎమ్మెల్యేలుప్రొటోకాల్‌పాటించక పోవడానికి అసలు కారణం మంత్రి పదవి అని తెలుస్తున్నది. ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చిన గడ్డం వివేక్ మంత్రి పదవి కోసం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం ప్రభుత్వంలో కాకా

మిగతా 2వ పేజీలో...



## 31కి కేటీఆర్ కేసు!

- క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా
- కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీకి ఆదేశం

2లో



## తెలంగాణ టెట్ హాల్‌టిక్కెట్లు విడుదల

జనవరి 2 నుంచి 20 వరకు పరీక్షల నిర్వహణ

2లో

నీలగిరి వార్త

శనివారం
28- 12- 2024

# మన్మోహన్‌కు సోనియా, రాహుల్ నివాళి

- ఖర్గే తదితరులు శ్రద్ధాంజలి
- నేడు ఎఐసిసి కార్యాలయానికి పార్థివదేహం

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :**
భారత మాజీ ప్రధానమంత్రి, దేశ ఆర్థిక సంస్కరణల రూపకర్త మన్మోహన్ సింగ్ (92) పార్థివ దేహానికి కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా అపారమైన జ్ఞానం, సమగ్రతతో భారతదేశాన్ని అభివృద్ధి వైపు నడిపించారు. ఆయనలోని వినయం, ఆర్థికశాస్త్రంపై ఆయనకున్న లోతైన అవగాహన దేశానికి స్ఫూర్తినిచ్చాయి. నా జీవితంలో ఎంతో ముఖ్యమైన ఓ గురువును కోల్పోయాను' అని అన్నారు. ప్రియాంకా గాంధీ వాద్రా, ఆమె భర్త రాబర్ట్ వాద్రా సైతం మన్మోహన్ నివాసానికి చేరుకున్నారు. రాబర్ట్ వాద్రా మాట్లాడుతూ.. మన్మోహన్ ఎల్లప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేసేవారని పేర్కొన్నారు. ఆర్థిక విషయాలపై ఆయనకు చాలా జ్ఞానం ఉందని అన్నారు. మన్మోహన్ సింగ్ యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా పని చేశారు.



కాంగ్రెస్ పార్టీతో, గాంధీ కుటుంబంతో మన్మోహన్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. గురువారం రాత్రి ఆయన మరణవార్త తెలియడంతో కర్ణాటకలోని బెళగావిలో జరుగు తున్న సీడబ్ల్యూసీ సమావేశాలను అర్ధంతరంగా ముగించి.. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ వెంటనే దిల్లీకి బయలుదేరారు. దిల్లీలోనే ఉన్న సోనియా, ప్రియాంక ఆసుపత్రి వద్దకు చేరుకు న్నారు. శనివారం ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. దీనిపై అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మన్మోహన్ పార్థివ దేహాన్ని ఆయన నివాసంలో ఉంచారు. ప్రజల సందర్శనార్థం శనివారం ఆయన భౌతికకాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకురానున్నారు. రాజ్‌ఘాట్ సమీపంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

# మన్మోహన్‌కు సీఎం రేవంత్ నివాళి

పార్థివదేహం వద్ద మంత్రులతో కలసి శ్రద్ధాంజలి

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :**
మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. సీఎంతోపాటు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, తెలంగాణ ఎంపీలు ఢిల్లీలోని మోతీలాల్ నెహ్రూ మార్గ్ వద్ద ఉన్న మన్మోహన్ సింగ్ నివాసానికి చేరుకున్నారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం భారతదేశ ప్రజలకు తీర్చలేనటువంటి లోటన్నారు. 1991లో పీవీ నరసింహారావు ప్రధాని మంత్రిగా ఉన్నప్పుడు మొట్ట మొదటిసారిగా మన్మోహన్ సింగ్‌ను ఆర్థిక శాఖ మంత్రి నియమించారని గుర్తు చేశారు. 15 టన్నుల బంగారాన్ని కుదవపెట్టి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చారన్నారు. భారతదేశ ఆర్థిక పరిస్థితి కుదేలైన సమయంలో ప్రధానిగా పీవీ



నరసింహారావు, ఆర్థిక శాఖ మంత్రిగా మన్మోహన్ సింగ్ వచ్చారని వెల్లడించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి గల ముఖ్య కారకుడు మన్మోహన్ సింగ్ అని మల్లు రవి కొనియాడారు. ఆ ఐదు సంవత్సరాలు ఆర్థిక ఇబ్బందులను బయటపడి ప్రగతి పథంలో ముందుకు వెళ్ళిందన్నారు. మన్మోహన్ సింగ్ అంటేనే సంస్కరణలకు పెట్టింది పేరని.. దేశం ఒక మహా నేతను కోల్పోయిందన్నారు. మన్మోహన్ సింగ్ తీసుకువచ్చిన సంస్కరణల అడుగుజాడల్లోనే తదుపరి వచ్చిన ప్రధాన మంత్రులు నడుచుకున్నారని స్పష్టం చేశారు. ఆయనను గొప్ప ప్రధానిగా గుర్తించి సేవలను అందరూ తలచుకుంటున్నారన్నారు.

# గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిన భారత్

- ఆయన మరణం దేశానికి తీరని లోటు
- భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన చంద్రబాబు

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :**
మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దిల్లీలో మన్మోహన్ పార్థివ దేహానికి నివాళులర్పించిన అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఆయన మరణం బాధాకరమన్నారు. ఆయన దేశానికి అవిశ్రాంతంగా సేవలందించారని కొనియాడారు. దూరదృష్టితో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారని.. అనేక పదవులను సమర్థంగా నిర్వహించారని చెప్పారు. భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు.. కానీ, ఆయన భావజాలం శాశ్వతంగా ఉంటుందన్నారు. ఢిల్లీలోని మన్మోహన్ సింగ్ నివాసానికి చేరుకున్న సీఎం చంద్రబాబు



నాయుడు.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి నివాళులర్పించారు.. కుటుంబ సభ్యులను పరామర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో గొప్ప ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని పేర్కొన్నారు.. మన్మోహన్ లేని లోటు ఎవరూ పూడ్చలేరన్న ఆయన.. ప్రధానమంత్రిగా, ఆర్థిక మంత్రిగా, యూజీసీ చైర్మన్‌గా, ఆర్బీఐ గవర్నర్ గా ఉన్నత బాధ్యతలు నిర్వర్తించారు.. దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచారని గుర్తుచేశారు.

# మన్మోహన్‌తో విడదీయరాని బంధం

ఆనాటి జ్ఞపకాలు గుర్తు చేసుకున్న నేతలు

**వరంగల్- నీలగిరివార్త :** ఓరుగల్లుతో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు అనుబంధం ఉంది. వరంగల్ ఆర్‌ఈసీలో 1992లో జరిగిన కాకతీయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి నాడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి హోదాలో డాక్టర్ మన్మోహన్‌సింగ్ హాజరయ్యారు. కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ జయశంకర్ సారథ్యంలో జరిగిన వేడుకల్లో ఆయన చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఆయన మామునూరుకు రాగా అక్కడి నుంచి ఆర్‌ఈసీకి చేరుకున్నారు. నాడు రాష్ట్ర మంత్రులుగా పొన్నాల లక్ష్మయ్య, మాదాడి నర్సింహారెడ్డి, జగన్నాయక్, పీవీ రంగారావు, వరంగల్, హనుమకొండ పార్లమెంటు సభ్యులుగా ఆర్.సురేందర్‌రెడ్డి, కమాలుద్దీన్ అహ్మద్, కేయూ పాలక మండలి సభ్యుడిగా డాక్టర్ బండా ప్రకాశ్ బృందం మన్మోహన్‌సింగ్‌తో వేడుకలలో పాల్గొన్నారు. ఈ వేదికపైనే ప్రపంచ ధ్వని అనుకరణ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్, ప్రజాకవి కాళోజీ నారాయణరావుకు గౌరవ డాక్టరేట్ అందించారు. తొలిసారిగా ఎంపీగా గెలిచిన తర్వాత తనకు కేంద్రసహాయ మంత్రి రావడంలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పాత్ర ఎంతో ఉందని ఎంపి పోరిక బలరామ్ అన్నారు. గిరిజన సామాజిక వర్గం నుంచి ఎన్నికైన తనను మన్మోహన్‌సింగ్ ఎంతో ప్రోత్సహించేవారు. విద్య,



వైద్యంతో పాటు పేదలకు ఉపయోగపడే ఏ పని కావాలన్నా తనను అడుగు ఇస్తానంటూ వెన్నుతట్టి ప్రోత్సహించిన ఆయన మృతి చెందారనే విషయం తెలిసి తండ్రిని కోల్పోయినంత బాధగా ఉంది. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆయన సహకారంతోనే తాడ్వాయి-పస్రా అటవీ రహదారి విస్తరణతోపాటు పలు అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేసుకున్నారు. భారత మాజీప్రధాని మన్మోహన్‌సింగ్‌తో తనకు విడదీయరాని అనుబంధం ఉందని రాష్ట్ర మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సంతాపాన్ని ప్రకటించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, దేశ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ పనిచేసిన సమయంలో తాను అనేకసార్లు కలిసినట్లు గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి ఏపీలో తాను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రిగా బాబ్లీ ప్రాజెక్టు, నాగర్జునసాగర్ అంశంలో మన్మోహన్ సింగ్‌ను కలిసి మాట్లాడానని చెప్పారు. మన్మోహన్ సింగ్ మరణం తీరని లోటని పేర్కొన్నారు.

# మన్మోహన్ గొప్ప ఆర్థిక వేత్త

ఆయన మరణం తీరని లోటు: జగన్

**పులివెందుల- నీలగిరివార్త :**
మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని మాజీ ముఖ్య మంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆయన మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం పులివెందులలోని తన నివాసంలో జగన్ మాట్లాడుతూ పదేళ్లపాటు దేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ గొప్ప సేవలందించారని ప్రశంసించారు. ఆయన మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆర్బీఐ గవర్నర్ గా, ఆర్థిక మంత్రిగా ఆర్థిక సంస్క-




రణల తో దేశ పురోభివఅద్ధికి ఎంతగానో కృషిచేశారన్నారు. ఎన్నో బాధ్యతలు నిర్వహించిన మన్మోహన్ సింగ్ గొప్ప మేధావి అని కొనియాడారు. మన్మోహన్ సింగ్ మృతితో దేశం ఒక మహా నాయకుడిని కోల్పోయిందని చెప్పారు.

# మర్చిపోవడం చంద్రబాబు నైజం

- ఎమ్మెల్యే తాటిపర్తి
- పెంచిన విద్యుత్ ఛార్జీలపై నిరసన

**బ్యూరో ఇంచార్జీ- నీలగిరివార్త :**
ఎన్నికల సమయంలో కరెంటు చార్జీలను తగ్గిస్తామని నమ్మబలికి..అధికారంలోకి వచ్చాక ఆర్నెల్లలోనే రూ. 15,485.36 కోట్ల భారాన్ని ప్రజల పై మోపిన సీఎం చంద్రబాబు సర్కారు పై వైయస్ఆర్‌సీపీ సమరభేరి మోగించడంతో ప్రజలకు తోడుగా నిలుస్తూ,రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నాడు అన్ని నియోజకవర్గాల్లో కరెంటు చార్జీల పెంపునకు నిరసనగా విద్యుత్ కార్యాలయాల వద్ద వైయస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తల నిరసన కార్యక్రమాలతో ముట్టడించడం జరిగింది.ఈ నేపథ్యంలో భాగంగానే ప్రకాశంజిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నేతృత్వంల ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఎర్రగొండపాలెం విద్యుత్ శాఖ ఏఈఈ తలపాటి అలురయ్యకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వినతిపత్రం సమర్పించడం జరిగింది. తదుపరి ఎమ్మెల్యే పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని



ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు'అధికారం చేపట్టగానే విద్యుత్ ఛార్జీల బాదుడు మొదలెట్టారని మండిపడ్డారు. గతంలో కూడా టీడీపీ అధికారంలో ఉండగా దాదాపు రూ. 20 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీలను వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వానికి అంటగట్టి చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయిన్నప్పటికీ,ఆ భారాన్నంతా ప్రజల పై మోపకుండా జగన్ ప్రభుత్వం డిస్కంలకు సకాలంలో రాయితీలు అందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2014-19 వరకు టీడీపీ సర్కారు రూ. 13,255.76 కోట్లు మాత్రమే సబ్సిడీల కింద చెల్లించగా, వైయస్ ఆర్‌సీపీ అధికారంలో ఉండగా రూ. 47,800.92 కోట్లను సబ్సిడీగా అందించింది. చంద్రబాబు రైతులకు ఎగ్గొట్టిన రూ. 8,845 కోట్ల ఉచిత విద్యుత్ బకాయిలను సైతం వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వమే చెల్లించిందే తప్పా.. రాష్ట్రంలోని సామాన్య ప్రజానీకం పై బలవంతంగా నెట్టలేదన్నారు.ఇది వైయస్ జగన్మోహన్ రెడ్డి కమిట్‌మెంట్ అంటూ ఆయన వాస్తవిక ఆధారాలతో సహా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పై తనదైన శైలిలో ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమానికి ఎర్రగొండపాలెం మండల కన్వీనర్ కొప్పర్తి చిన్న ఓబుల్ రెడ్డి,వైకాపా సీనియర్ నాయకులు వై.ముసలారెడ్డి, సూరె. వెంకటరమేష్ ,బి.రమణారెడ్డి, ముడమంచు బాలగురవయ్య యాదవ్ ,బొమ్మోజీ బాలచెన్నయ్య , గుమ్మ అంజనేయులు యాదవ్ ,మేకల వెంకటేశ్వర్లు యాదవ్ ,మేడగం వెంకటరెడ్డి, జక్కా సుబ్బారావు, మొగిలి సుబ్బారావు, కందూరి గురుప్రసాదు, సర్పంచి అరుణభాయి, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, యం.పి.పి.డి.కిరణ్ గౌడ్ ,మరియు ఆయా మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మన్మోహన్‌సింగ్ హయాంలోనే తెలంగాణ!

మొదటిపేజీ తరువాయి..
లభించింది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలోనే నెరవేరింది. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ డిసెంబర్ 9 ప్రకటన వెలువడింది. 1971లో తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తామని మాటతప్పిన కాంగ్రెస్ తప్పును 2014లో సరిదిద్ది, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు బాటలు వేసిన ఘనత ఆయనకు దక్కుతుంది. తన ప్రభుత్వానికి పూర్తి స్థాయి మెజార్టీ లేకున్నా అత్యంత వ్యూహాత్మకంగా తెలంగాణ బిల్లును ఉభయసభల్లో గట్టెక్కించారు. తెలంగాణ ఏర్పాటును కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆంధ్ర నేతలు, ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్ర కేబినెట్‌లో ఉన్న ఏపీ నేతలు రాజీమానా చేస్తామని బెదిరించారు. అయినప్పటికీ మన్మోహన్ సింగ్ వెనక్కి తగ్గలేదు. పార్లమెంటులో రచ్చజరిగినా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ చేయించేందుకు మన్మోహన్ సింగ్ కీలక భూమిక పోషించారన్నారు అప్పటి కేంద్రహోంమంత్రి షిండే అన్నారు. ఇక అధికారం కోల్పోయాక కూడా విభజన సమస్యల పరిష్కారానికి మన్మోహన్ డిమాండ్ చేశారు. విభజన హామీలన్నింటిని నెరవేర్చాలన్నారు. ఇక, దశాబ్దాల పాటు తెలంగాణపై కొనసాగిన అణచివేత, ఆర్థిక దోపిడీ, సామాజిక, సాంస్కృతిక వివక్ష తెలిసిన అతికొద్ది మంది జాతీయ నాయకుల్లో మన్మోహన్‌సింగ్ ముందు వరుసలో ఉంటారు. తెలంగాణ ఆకాంక్షలను, రాష్ట్రం ఆవిర్భవించకపోతే జరిగే అనర్థాలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కొత్తపల్లి జయశంకర్ పూసగుచ్చినట్టు వివరిస్తే అర్థం చేసుకున్న మనసున్న పాలకుడు మన్మోహన్ సింగ్.

**త్రిమూర్తుల కూర్పు.. డిసెంబర్ 9 ప్రకటన**

తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తామని యూపీఏ ప్రభుత్వం డిసెంబర్ 9న చేసిన ప్రకటనను త్రిమూర్తుల కూర్పుగా చెప్పుంటారు. ప్రకటన చేసింది నాటి హోంమంత్రి చిదంబరమే అయినా.. కేసీఆర్‌కు, మన్మోహన్ సింగ్‌కు మధ్య వారధిగా జయశంకర్ సార్ ఉన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు మద్దతు కూడగట్టడంలో కేసీఆర్‌కు మన్మోహన్ సింగ్ సూచనలు చేశారు.

# నిద్ర లేచింది మహిళా లోకం!

మొదటిపేజీ తరువాయి..
ఏమంటారు రేవంత్ రెడ్డి జీ అని అడుగుతారా? అలాగే కొడంగల్ లో ఒక రైతు ఆత్మహత్య చేసుకుని దానికి కారణం సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులే అని చెప్పి, లేఖ రాసి పెట్టి మరీ సూసైడ్ చేసుకున్నాడట! మరి వాళ్ల కుటుంబానికి రూ. 25 లక్షలు ఇచ్చారా? పోనీ పాతిక వేలు ఎవరైనా ఇచ్చారా? ఆయనెవరో? కోమటిరెడ్డి వెంకటరెడ్డి అట.ఆయన పేరు పొద్దు తిరుగుడు పువ్వు అంట. ఆ పువ్వు ఎట్ట తిరిగితే అట్ట తిరుగుతాడట.మరి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆ రైతు ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులని పరామర్శించి డబ్బులు ఇచ్చారా? అల్లు అర్జున్ చేసింది క్రైమ్ కాదు. ఆయనకి తెలియకుండా జరిగింది. ఆయన దానిమీద సరిగా స్పందించక పోవడం ఆయన చేసిన పొరపాటు. తప్పుకు, నేరానికి, పొరపాటుకు చాలా తేడా ఉంటుంది. అందరిలాగా ఆయన కూడా సామాన్య వ్యక్తే! మీకు ఎలాంటి విధులు, హక్కులు వర్తిస్తాయో? ఆయనకీ వర్తిస్తాయి. జరిగిన చిన్న తప్పుకి సినిమా ఇండస్ట్రీ మీద ఉక్కుపాదం మోపాలి సినిమా ఇండస్ట్రీని కాళ్ళ కింద పెట్టుకోవాలని చూస్తున్నారు. ఎలా అయితే జగన్ సినిమా వాళ్లందరినీ పిలిపించుకొని ఫోజులు కొట్టి దండం పెట్టించుకున్నట్లు మనం సీఎం అయ్యాక ఎందుకు చేయించు కోకూడదు అని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి గారు మీ ప్రయాణం అంతా చాలా బాగుంది. మొదటి నుండి ఎంతో కష్టపడి పైకొచ్చి ఈరోజు సీఎం అయ్యారు. జీవితంలో చాలా చాలా సాధించారు. మరి ఎందుకిప్పుడు? ఇంత గలీజుగా బిహేవ్ చేస్తున్నారు. స్థాయికి వచ్చాక ఎందుకు ఇంత గలీజుగా బిహేవ్ చేస్తున్నారు. గురుకుల పాఠశాలల్లో ఎంతోమంది చనిపోయారు.ఏనాడూ మాట్లాడినపాపాన పోలేదు.అందరికీ సమానంగా స్పందించండి. ఓకేనా? డైరెక్ట్ గాబాధితులకు స్పందించక పోగా సినిమా వాళ్ల మీద దిల్ రాజును అడ్డు పెట్టుకుని పెత్తనం చెలాయించాలని చూస్తున్నారు. ఏం చేస్తారు.సినిమావాళ్ల బతుకులు అలాంటివి మరి! వచ్చి మీ కాళ్లు మొక్కుతారు అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై మాధవీలత షాకింగ్ కామెంట్స్ చేసింది. ఇదిలా ఉంటే గురువారం సినీ ప్రముఖులు కొందరు సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయిన విషయం తెలిసిందే! ఈ భేటీ అనంతరం, సీఎం దృష్టి అంతా హైదరాబాద్ ను ఇంటర్నేషనల్ సినిమా హబ్ గా ఎలా తీర్చిదిద్దాలనే ఆలోచనే అంటూ దిల్ రాజుతో పాటు హాజరైన వారంతా చెప్పుకొచ్చారు.

# పెద్దపల్లిలో ప్రొటోకాల్ రగడ!


మొదటిపేజీ తరువాయి..
కుటుంబానికి సముచిత స్థానం కల్పిస్తామంటూ పలుమార్లు ప్రకటించారు.ఇది కాస్తా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే ఉన్న మంత్రితో పాటు ఎమ్మెల్యేలకు సైతం రుచించడంలేదనేచర్చ నడుస్తున్నది. మంత్రి పదవి కోసం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుతో పాటు బెల్లంపల్లి ఎమ్మెల్యే వివేక్ సోదరుడు గడ్డంవినోద్ సైతం పోటీ పడుతున్న నేపథ్యం.ఈ క్రమంలో మొన్నటి దాకా మంచిర్యాల జిల్లాకే పరిమితమైన ఆధిపత్యపోరు.ఇప్పుడు పెద్దపల్లి పార్లమెంట్ మొత్తం సోకినట్లు కనబడుతున్నది. మంత్రి పదవి వివేక్ రావడం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మిగిలిన ఎమ్మెల్యేలకు ఇష్టంలేదని ప్రస్తుత పరిణామాలే స్పష్టం చేస్తున్నాయి. వివేక్‌కి మంత్రి పదవి ఇస్తే ఆయన కుమారుడు ఎంపీగా ఉండి పెద్దపల్లి మొత్తాన్ని వారి చేతుల్లోకి తీసుకునే ప్రమాదముందని కాంగ్రెస్ ఎమ్మెల్యే లు భావిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గడ్డం సోదరుల్లో ఎవరికి మంత్రి పదవి వచ్చినా తమకు ఇబ్బందులు తప్పవనే ఆలోచనల్లో ఉన్నట్లు తెలుస్తున్నది. అదే జరిగితే మంత్రిగా ఉన్న తను పెద్దపల్లి పార్లమెంట్‌పై పట్టు కోల్పేయే ప్రమాదముందని మంత్రిగా ఉన్న శ్రీధర్ బాబు సైతం భావిస్తున్నారని, అందుకే మంత్రి పదవి విషయంలో ఆయన గడం కుటుంబానికి సపోర్టు చేయడం లేదని సమాచారం. గతంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క టూర్ సందర్భంగా శ్రీధర్‌బాబు మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్‌కు మద్దతుగా మాట్లాడం సైతం దీనికి బలం చేకూరుస్తున్నది. పైగా పార్లమెంట్ పరిధిలోని మిగిలిన ఎమ్మెల్యేలు మంత్రి శ్రీధర్‌బాబుకు విధేయులేనని ఈ మేరకు అంతా ఒక్కటయ్యారని అందుకే ఎంపీకి ప్రాధాన్యం తగ్గిందని, ఆయన విషయంలో ప్రొటోకాల్ పాటించడం లేదనే ప్రచారం ఇప్పుడు హస్తం పార్టీలో అగ్గి రాజేస్తున్నది మరో పక్క అధికారుల తీరుపై పార్లమెంట్‌లో ప్రివిలేజ్ మోషన్ మూవ్ చేస్తానని ఎంపీ అనడంతో ఈ ప్రొటోకాల్ రగడ ఎటువైపు దారి తీస్తుంది అసలు ఏం జరగనున్నదోననే అంశం రసవత్తరంగా మారిందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# మన్మోహన్ కేబినేట్‌లో పనిచేయడం అదృష్టం

మొదటిపేజీ తరువాయి..
మనోధైర్యాన్ని నింపుతూ అండగా నిలిచారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగింది. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో ఆయన అందించిన సహకారం మరువలేనిది. తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్‌కు భారాస తరపున ఘన నివాళులు' అని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఢిల్లీకి బయల్దేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాజ్యసభ ఎంపీలు, పలువురు నాయకులు శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్ సింగ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలోని పార్టీ ఎంపీలు, నాయకుల బృందం ఘన నివాళులర్పించనుంది. అంత్యక్రియల్లో పాల్గొని మన్మోహన్ సింగ్‌కు బీఆర్ఎస్ నేతలు ఘనంగా వీడ్కోలు పలకనున్నారు. దేశ ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్ట్‌గా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారని కేసీఆర్ పేర్కొన్నారు. దాంతో పాటు తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం మన్మోహన్ సింగ్‌తో ఉంది. వారి కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన నాకు వారితో వ్యక్తిగత అనుబంధముంది. వారెంతో స్థితప్రజ్ఞత కలిగిన దార్శనికులు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు దాకా వారందించిన సహకారం తెలంగాణ సమాజం మరువదు. తెలంగాణ కోసం పోరాడుతున్న నాకు, టీఆర్ఎస్ పార్టీకి ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ వారు అండగా నిలిచారు. వారు ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో నాకు వారందించిన సహకారం మరువలేను. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. వారి కడసారి వీడ్కోలు సందర్భంగా అంత్యక్రియల్లో పాల్గొనాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను, ఎంపీలను ఆదేశించాను. ఈ మేరకు వారు హాజరుకానున్నారు అని కేసీఆర్ తెలిపారు.

# 30వ తేదీకి అల్లు అర్జున్ కేసు వాయిదా

మొదటిపేజీ తరువాయి..
బన్నీకి నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసును సవాల్ చేస్తూ అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు అల్లు అర్జున్?కు 4 వారాల మధ్యంతర బెయిల్ ఇచ్చింది. దీంతో బన్నీ జైలు నుండి విడుదల అయ్యాడు. ఈ కేసులో రెగ్యులర్ నాంపల్లి కోర్టులో దరఖాస్తు చేసుకోవాలని బన్నీకి హైకోర్టు సూచించింది. ఈ మేరకు అల్లు అర్జున్ నేడు నాంపల్లి కోర్టులో రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్?పై విచారణ జరగగా కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసుల తరుపు పీపీ సమయం కోరారు. దీంతో బన్నీ బెయిల్ పిటిషన్‌పై కోర్టు సోమవారానికి విచారణ వాయిదా వేసింది. మరోవైపు నాంపల్లి కోర్టు విధించిన 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ ఇవాళ్టితో ముగియడంతో బన్నీ వర్చువల్ గా నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. ఇక తొక్కిసలాట కేసు విచారణను జనవరి 10 వ తేదికి వాయిదా వేసింది.



# 31కి కేటీఆర్ కేసు!

- క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా
- కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీకి ఆదేశం

**బ్యూరోచీఫ్ - నీలగిరివార్త :**
ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ విచారణను హైకోర్టు ఈ నెల 31వ తేదికి వాయిదావేసింది హైకోర్టు. అలాగే అతడిని అరెస్ట్ చేయవద్దంటూ ఈ నెల 30వరకు ఇచ్చిన అనుమతిని ఈ నెల 31 వరకు పొడిగించింది. ఇదే సమయం లో ఏసీబీ ని కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. నేడు కోర్టులో ఏసీబీ తరుపు న్యాయవాది ఈ కేసులో కేటీఆర్ కు ఇచ్చిన మధ్యంతర బెయిల్ ను రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కూడా ఎసిబిని కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు కోరింది.



# అవినీతి వ్యతిరేక చర్యలపై వేగంగా స్పందించారు

మన్మోహన్ మృతికి సంతాపం ప్రకటించన అన్నా హజారే

**రాలేగావ్ సిద్ధి- నీలగిరివార్త :**
మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ మృతికి ప్రముఖ సామాజిక కార్యకర్త, అవినీతి వ్యతిరేక ఉద్యమ నేత అన్నా హజారే సంతాపం తెలిపారు. ఆయన అవినీతికి వ్యతిరేకి అని, లోక్‌పాల్, ఇతర అవినీతి వ్యతిరేక చర్యలకు వేగంగా చర్యలు తీసుకున్న నేత అని కొనియాడారు. మహారాష్ట్రలో తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో జాతీయ వార్తా సంస్థతో హజారే మాట్లాడుతూ, పుట్టినవారికి మరణం తప్పదని, అయితే కొన్ని జ్ఞాపకాలు, వారసత్వం మాత్రం మిగిలి పోతాయని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు డాక్టర్ మన్మోహన్ సింగ్ కొత్త దిశను చూపించారని, దేశం, సమాజ సంక్షేమానికి సింగ్ ప్రాధాన్యతనిచ్చే వారని అన్నారు.



# ఎన్నికలు ఎలాపెడతారో చూస్తా!

మొదటిపేజీ తరువాయి..
కేంద్రాల్లో, జిల్లాల్లో నిరసన ప్రదర్శన చేస్తామన్నారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చాకా, బీసీ జనాభాను వెల్లడించిన తర్వాతే ఎన్నికలపై ఆలోచన చేయాలన్నారు. అంత వరకు స్థానిక సంస్థల ఎన్నికల గురించి ప్రభుత్వం ఆలోచన చేయకూడదన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభను నిర్వహిస్తామన్నారు.

# మన్మోహన్‌కు ప్రముఖుల నివాళి

మొదటిపేజీ తరువాయి..
నిర్వర్తించారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం వెల్లడించింది. ఆయన మృతికి సంతాప సూచికంగా 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. ప్రజల సందర్శనార్థం శనివారం ఆయన భౌతికకాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకురానున్నారు. శనివారం రాజ్‌ఘాట్ సమీపంలో ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.



# తెలంగాణ టెట్ హాల్‌టిక్కెట్లు విడుదల

జనవరి 2 నుంచి 20 వరకు పరీక్షల నిర్వహణ

**హైదరాబాద్- నీలగిరివార్త :**
తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌కు హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. జనవరి 2 నుంచి 20 వరకు జరిగే ఈ పరీక్షల హాల్‌టికెట్లను విద్యాశాఖ అధికారులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు సెషన్- 1; మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు నిర్వహిస్తారు. జనవరి 2, 5, 11, 12, 19, 20 తేదీల్లో ఆరు రోజులు పేపర్ -2 పరీక్షలు జరగనుండగా.. జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నాలుగు రోజులు పేపర్ -1 పరీక్షలు నిర్వహిస్తారు. నవంబర్ 7 నుంచి 20 వరకు టెట్‌కు దరఖాస్తులు స్వీకరించగా.. దాదాపు 2.75లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ కు సంబంధించిన హాల్ టికెట్లను టీజీ టెట్ కన్వీనర్ శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. టెట్ రాతపరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించనున్నారు.

# నిజమైన రాజనీతిజ్ఞుడు

మొదటిపేజీ తరువాయి..
సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది. ఆయన నిజమైన రాజనీతిజ్ఞుడని, దేశం కోసమే తన జీవితాన్ని ధారపోశారని గుర్తు చేసుకున్నారు.ఏఐసీసీ కార్యాలయంలో సీడబ్ల్యూసీ సభ్యులు సమావేశమై సంతాప తీర్మానం చేశారు. శనివారం జరిగే మన్మోహన్‌సింగ్ అంతిమసంస్కారాల నిర్వహణపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంక, తదితర నేతలంతా పాల్గొన్నారు. భారతదేశ రాజకీయ, ఆర్థిక రంగంలో మన్మోహన్ ఒక మహోన్నత వ్యక్తి అని, ఆయన చేసిన కృషి దేశాన్ని మార్చివేసిందని తెలిపింది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఆయనకు గౌరవాన్ని తెచ్చిపెట్టిందని గుర్తుచేసుకున్నారు. 1990 ప్రారంభంలో ఆర్థిక మంత్రిగా భారతదేశ ఆర్థిక సరళీకరణకు రూపశిల్పి అని కొనియాడారు. అసమానమైన దూరదృష్టితో వరుస సంస్కరణలను ప్రారంభించారన్నారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి రక్షించడమే కాకుండా ప్రపంచ మార్కెట్లకు కూడా తలుపులు తెరిచాయని స్మరణచేసుకున్నారు. నియంత్రణ సడలింపు, ప్రైవేటీకరణ మరియు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహం వంటి విధానాల ద్వారా భారతదేశం వేగవంతమైన ఆర్థిక వృద్ధికి పునాది వేశారని నేతలు నెమరువేసుకున్నారు. ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందు తున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉద్భవించిందని కొనియాడారు.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUBLICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/11957/2009. Cell No : 96765 49223.